

బ్రహ్మోత్సవాల్లో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పూజారులు

## జీడికల్ ఆలయంలో వైభవంగా పూర్ణాహుతి

లింగాలఘనపురం, నవంబర్ 22 : మండలంలోని జీడికల్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం పూజారులు పూర్ణాహుతి చేట్టారు. ఆలయంలో ఉదయం నిత్యాహవచనం, ద్వారాతోరణం, బలిహారణం అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం దేవతోద్వాసన, ద్వాదశ ఆరాధన ధ్వజ అవరోహణ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో జీడికల్ ఆలయ చైర్మన్ ఏలె నరసింహమూర్తి, ఈవో వంశీ, జనగామ ఉప్పలమ్మ దేవాలయ ఈవో కేకే రాములు ,సిబ్బంది రాజేందర్‌రెడ్డి, భరత్‌కమార్, మల్లేశం, శంకర్ పూజారులు గట్టు శ్రీనివాసాచార్యులు, విజయసారథి, బుచ్చయ్య శర్మ, గట్టు రఘురాం, రాఘవ, భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, ఆలయ డైరెక్టర్లు శ్రీశైలం, వెంకటేశ్ పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

జనగామ చౌరస్తా, నవంబర్ 22 : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని జనగామ డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/కాలేజీలో నెహ్రూ యువ కేంద్రం వరంగల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మల్లికార్జున్ మాట్లాడుతూ గుట్కా, గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలు యువకులపై చెడు ప్రభావాన్ని కలిగిస్తాయని సూచించారు. క్రమశిక్షణతో చదువుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి చింతల అన్వేశ్, సైక్రియాట్రిస్ట్ సిద్ధార్థరెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, దేవీలాల్, రాజేందర్ పాల్గొన్నారు.



ఫర్నీచర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

## నర్సింగ్ కళాశాల పనులు పూర్తి చేయాలి

జనగామ చౌరస్తా, నవంబర్ 22 : జిల్లా కేంద్రంలో చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అభివృద్ధి పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ధర్మకంచ ఎస్సీ బాలికల వసతి గృహంపై అంతస్తులో జరుగుతున్న నర్సింగ్ కళాశాల పనులను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులకు అవసరమైన కుర్చీలు, ఫ్యాన్లు, ఫర్నీచర్, కిచెన్ రూమ్, వాష్ రూమ్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధ, మున్సిపల్ డీఈ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో భక్తులతో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

## అభయాంజనేయస్వామి విగ్రహ ఊరేగింపు

జఫర్‌గఢ్, నవంబర్ 22 : మండల కేంద్రంలో ప్రతిష్ఠించనున్న అభయాంజనేయస్వామి వారి విగ్రహ ఊరేగింపు శుక్రవారం ఘనంగా జరిగింది. రేగడితండా శివారు కేజీ తండా వాస్తవ్యులు లకావత్ సుభద్ర, రవీందర్ దంపతులచే నూతనంగా ప్రతిష్ఠించనున్న విగ్రహ ఊరేగింపునకు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజయ్య స్వామి వారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. జలాభిషేకం, పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆంజనేయస్వామి వారి ఊరేగింపులో రాజయ్య కోలాట కళాకారులతో కలిసి డప్పు కొట్టి ధరువేసి ఉత్సాహపరిచారు. గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338964-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## రూ.5 భోజన క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

జనగామ చౌరస్తా, నవంబర్ 22 : జిల్లా కేంద్రంలో రూ.5 భోజనం క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో మన్సూరికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి వంగ భీమ్‌రాజ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో పాటు నిరుద్యోగులు, కార్మికులు, నిరాశ్రయులకు రూ.5 భోజనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సభ్యులు సాయి, కార్తిక్, లకన్ సింగ్, హరీ శ్, చందు పాల్గొన్నారు.

## డీఈవో రాము జగిత్యాలకు బదిలీ

జనగామ చౌరస్తా, నవంబర్ 22 : జిల్లా విద్యాశాఖ అధికారి కే రాము జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం రమేశ్‌ను డీఈవోగా (ఎఫ్ఏసీ)గా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఈ వెంకట నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

# దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో రాణించాలి

**క్రీడల ప్రారంభోత్సవంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**



జనగామలో దివ్యాంగుల క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, నవంబర్ 22 : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల క్రీడోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ రన్నింగ్, షార్ట్‌పుట్, క్యారమ్స్, చెస్ క్రీడలను జెండా ఊపి ప్రారంభించారు. షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ అంగవైకల్యం అనేది శరీరానికే గాని, మనసుకు కాదని తెలిపారు. దివ్యాంగులు ఏ రంగంలోనైనా మనసుపెట్టి పనిచేస్తే విజయం సాధిస్తారని ఆయన పేర్కొన్నారు. పాజిటివ్ దృక్పథంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఆయా క్రీడాపోటీల్లో పలువురు దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభచాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి ఫ్లోరెన్స్, యువజన క్రీడలశాఖ అధికారి వెంకట్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించొద్దు

మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం సంబంధిత విద్యాశాఖ అధికారులతో ఆయన గూగుల్ మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు రుచి, శుచితో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. పాఠశాల వంట గది, వంట పాత్రలు, కూరగాయలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బియ్యం, పప్పు దినుసులు, కూరగాయలు తాజాగా ఉన్నవాటిని మాత్రమే విద్యార్థులకు భోజనంగా అందించాలన్నారు. పాఠశాలల్లో భోజన పర్యవేక్షణకు వెంటనే కమిటీలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఆహార పరిశుభ్రతలో ఉన్నతాధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు పాల్గొన్నారు.



సంపత్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

## పాగాలకు బీఆర్ఎస్ నేతల నివాళి

దేవరుప్పుల, నవంబర్ 22 : దివంగత జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మండలంలోని బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. చిల్పూరు మండలం రాజవరంలో నిర్వహించిన వర్ధంతి సభకు హాజరయ్యారు. సంపత్‌రెడ్డికి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యమ నేత కేసీఆర్ స్ఫూర్తితో జిల్లా నాయకుడిగా ఎదిగిన పాగాల సంపత్‌రెడ్డి హఠాన్మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య పాల్గొన్నారు.

## దేశ ప్రతిష్టను మంటగలిపిన అదానీని అరెస్ట్ చేయాలి

**సీపీఐ నేత తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు**



మాట్లాడుతున్న సీపీఐ నేత తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

జనగామ చౌరస్తా, నవంబర్ 22 : ప్రపంచ దేశాల్లో భారత ప్రతిష్టను మంటగలిపిన కార్పొరేట్ దిగ్గజం గౌతమ్ అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో సీపీఐ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీకి అత్యంత సన్నిహితుడైన కారణంగానే అదానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నారని విమర్శించారు. అదాని తీసుకున్న బ్యాంకు రుణం రూ.12 వేల కోట్లను కేంద్రం మాఫీ చేసిందని ఆయన ఆరోపించారు. లంచాలు ఇచ్చిన కారణంగా అమెరికాలో అదానిపై క్రిమినల్ కేసు నమోదు కావడంతో పాటు అరెస్ట్ వారెంట్ జారీ అయిన నేపథ్యంలో దీనికి బాధ్యత వహించి ప్రధాని నరేంద్రమోదీ తన నిజాయితీ నిరూపించుకోవాలని కోరారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి, నాయకులు రావుల సదానందం, పాతూరి సుగుణమ్మ, ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, సొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, పాతూరి ప్రశాంత్, నీల కనకయ్య, సముద్రాల రాజు, చింతకింది అరుణ, గుగులోత్ సఖి, గుర్రం మధు పాల్గొన్నారు.

## పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



ఎంఈవో కళావతికి ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దేవరుప్పుల, నవంబర్ 22: మండల కేంద్రంలోని బాలయేసు ఆంగ్లమాధ్యమ ఉన్నత పాఠశాల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగోని సుమ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల విద్యాశాఖాధికారి కళావతికి ఫిర్యాదు చేశారు. సుమ మాట్లాడుతూ గురువారం పాఠశాల బస్సుకింద పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటనపై పరిశీలనకు రాగా పలు అంశాలు వెలుగుచూశాయని తెలిపారు. ప్రతి బస్సుకు అటెండర్ ఉండాల్సి ఉండగా, తొమ్మిది బస్సులకు లేనట్లు తేలిందన్నారు. అటెండర్ లేకపోవడంతోనే బస్సు టైరు కింద బాలుడు పడి మృతి చెందాడని ఆమె ఆవేదన చెందారు. పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని, విద్యార్థుల వద్ద నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. తల్లిదండ్రుల పట్ల దురుసుగా వ్యవహరిస్తారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకన్న రాథోడ్, ఆర్య, శ్రీనాథ్ పాల్గొన్నారు

## ఔట్ సోర్సింగ్ నియామకాలపై సమగ్ర విచారణ జరపాలి

జనగామ చౌరస్తా, నవంబర్ 22 : జనగామ జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ డ్రైవర్ పోస్టుల నియామకాలపై సమగ్ర విచారణ జరపాలని పలువురు కోరారు. ఈ మేరకు బాధితులు బానోత్ రామ్‌కోటి, తుర్కపల్లి సోమయ్య శుక్రవారం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ పాషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌లో అర్హత కలిగిన వారిని కాదని తుది మెరిట్ జాబితాలో అనర్హులకు అవకాశం కల్పించారని వారు ఆరోపించారు. ఎంపిక చేసిన అభ్యర్థుల అడిషనల్ సర్వీస్ పాయింట్స్‌ను ముందుగా వెల్లడించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌లో ఎందుకని ప్రచురించలేదని వారు ఈ సందర్భంగా ప్రశ్నించారు.

## నేడు ముసాయిదా ఓటరు జాబితా విడుదల

జనగామ చౌరస్తా, నవంబర్ 22 : వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ముసాయిదా ఓటరు జాబితాను శనివారం జనగామ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ప్రదర్శిస్తామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డీఈవో, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల వద్ద ఓటరు జాబితాను పరిశీలన కోసం అందుబాటులో పెడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదైన వారు తమ వివరాలను పరిశీలించుకొని ఏవైనా అభ్యంతరాలుంటే నేటి నుంచి వచ్చే 12వ తేదీలోపు సంబంధిత అధికారులకు తెలియపర్చాలని సూచించారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని పేర్కొన్నారు.

## ఇంటి నంబర్లు లేనివారు జీపీకి దరఖాస్తు చేసుకోవాలి



సమస్యలు తెలుసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి లింగయ్య

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 22 : డివిజన్ కేంద్రంలోని మోడల్ కాలనీలో ఇంటి నంబర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి లింగయ్య కోరారు. ఈ నెల 10న మోడల్ కాలనీలో సమగ్ర కుటుంబ సర్వే తీరును ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించిన సమయంలో తమ ఇండ్లకు ఇంటి నంబర్లు లేవని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదేశాలతో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి లింగయ్య, సిబ్బంది రవి, సామేల్‌తో కలిసి మోడల్ కాలనీలో వాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఇంటి నంబర్లు లేని ఇండ్లను, సీసీ రోడ్లు, డ్రైనేజీ లేని వీధులను గుర్తించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ కాలనీ ప్రెసిడెంట్ అక్కనపల్లి అం జయ్య, మాజీ కో ఆప్షన్ సభ్యుడు యాకుబ్ పా షా, హీరా సింగ్, రాజన్న, లక్ష్మణ్, గణేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఖాతాదారుల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

**జనగామ ఏసీపీ పార్థసారథి**



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఏసీపీ పార్థసారథి

తరిగొప్పుల, నవంబర్ 22 : ఖాతాదారుల సౌకార్యర్థం బ్యాంకులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేరాలను నియంత్రిచాలని జనగామ ఏసీపీ పార్థసారథి అన్నారు. మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకును శుక్రవారం ఆయన సందర్శించారు. బ్యాంకులో సీసీ కెమెరాలు, అలారం పనిచేస్తున్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్థసరాథి మాట్లాడుతూ బ్యాంకులో లావాదేవీలు జరి గే సమయంలో ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. డబ్బులు డ్రా చేసే సమయంలో అపరిచితుల భారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తప్పనిసరిగా బ్యాంకులో, బయట సీసీ కెమెరాలు, అలారం ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై కాసర్ల రాజయ్య, బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ బాలాజీ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి సాయం

పాలకుర్తి, నవంబర్ 22: మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర, రిపోర్టర్ సట్ల మహేందర్ తండ్రి ఉప్పలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న తోటి ఫొటోగ్రాఫర్స్ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పట్టూరి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాపోల్ రాంబాబు ఆధ్వర్యంలో రూ.12 వేలు అందించారు. వీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి యాకయ్య గౌడ్ 50 కిలోల బియ్యం, కాంగ్రెస్ నాయకుడు ఎడవెల్లి సోమల్లయ్య 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్జి రాజు, బాలురాజు, ఎడవెల్లి వెంకన్న, ఎండీ పాషా, చిలువేరు మహేశ్, కాకర్ల రమేశ్ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక





రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 22 : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యారని శివునిపల్లి హెచ్ఎం కుసుమ రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ కొండ.రవి తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. శివునిపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ కాలేజీ మైదానంలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపారు. విద్యార్థులు బానోత్ ప్రకాశ్, జింక రాంచరణ్, గుర్రం నాని, గండికోట రాంచరణ్ పోటీలకు ఎంపికయ్యారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

### ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గత నెల ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీనికి సంబంధించిన వివరాలను పాఠశాల ప్రిన్సిపాల్ కే కృతమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, పీఈటీ లక్ష్మణ్, కోచ్ వై ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్ 14, 19 విభాగంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బీ కిరణ్, ఈ బన్నీ, పీ ఉదయకిరణ్, ఖోఖో పోటీల్లో బీ నిఖిల్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగే ఫుట్‌బాల్, ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు హైదరాబాద్‌లోని దోమలగూడలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో నిఖిల్ పాల్గొంటారని వారు తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## ఘనంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

జఫర్‌గఢ్, నవంబర్ 22 : మండల కేంద్రంలోని పడమటి కొండపై వెలిసిన శ్రీ వేల్పుగొండ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు సంగంపాలు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వారి బ్రహ్మోత్సవాల్లో గంగా స్వస్తి వాచనం, పుణ్యాహవచనం, రక్షాబంధనము, అంకురార్పణతో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం సుప్రభాతం, సేవాకాలం, ప్రాభోధకి, పారాయణములు, మూర్తి కుంభస్థాపన, అగ్ని ప్రతిష్ట, సుదర్శనారసింహ హోమం, పూర్ణాహుతి, ధ్వజారోహణం నిర్వహించనున్నట్లు వెంకటాచారి తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

జనగామ చౌరస్తా, నవంబర్ 22 : ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియన్ సివిల్ జడ్జి సీ విక్రమ్ అన్నారు. శుక్రవారం జనగామ పట్టణంలోని సబ్ జైల్‌లో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖైదీలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి విక్రమ్ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దు కోవాలని ఖైదీలకు సూచించారు. సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని పేర్కొన్నారు. బెయిల్‌పై విడుదలయ్యే ఖైదీలకు ష్యూరిటీ ఇవ్వడానికి లేదా న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేనివారికి న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తుందని ఆయన సూచించారు. ఖైదీలకు నాణ్యమైన భోజనం, మెరుగైన వైద్యం, ఇతర మౌళిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నర్మెటలోని మోడల్ స్కూల్‌లో తనిఖీ చేస్తున్న పింకేశ్‌కుమార్

## మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

నర్మెట, నవంబర్ 22: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని భోజనశాలను ఆయన పరిశీలించారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ బయట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని పలువురు విద్యార్థులు పింకేశ్‌కుమార్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ రామనుజాచారి, ఎంపీడీవో అరవింద్, ఎంఈవో ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీ చేస్తున్న సిబ్బంది

## సమగ్ర కుటుంబ సర్వేపై డాటా ఎంట్రీ

లింగాలఘనపురం, నవంబర్ 22 : గ్రామాల్లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను అధికారులు శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కులగణన వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో 30 కంప్యూటర్లను ఏర్పాటు చేసి అందుకు అవసరమైన ఆపరేటర్లను సమకూర్చారు. ఎన్యూమ రేటర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించిన సమగ్ర కుటుంబ, కుల గణన వివరాలను ఎంట్రీ చేయిస్తున్నారు. మండలాన్ని నాలుగు క్లస్టర్లుగా విభజించారు. నోడల్ ఆఫీసర్లు తహసీల్దార్ ఆండాలు, ఎంపీడీవో జలేంధర్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, ఎంఈవో విష్ణుమూర్తి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.



పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్లు

## బమ్మెరలో ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పాలకుర్తి, నవంబర్ 22: మండలంలోని బమ్మెరలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బమ్మెర గ్రామానికి చెందిన జోగు అబ్బయ్యకు చెందిన ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారు. నమ్మదగిన వ్యక్తి సమాచారం మేరకు పేకాట స్థావరంపై శుక్రవారం దాడి చేశారు. పేకాట రాయుళ్ల నుంచి రూ.2,270, ఐదు సెలఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగురిపై కేసులు నమోదు చేశామని ఎస్సై వివరించారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు వాకిడి రాజుకుమార్, సంపత్ పాల్గొన్నారు.

## వరి కొయ్యలకు నిప్పతో గడ్డివాములు దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న గడ్డివాములు

దేవరుప్పుల, నవంబర్ 22: మండల కేంద్రానికి చెందిన ఓ రైతు తన పొలంలో కొయ్యకాళ్లను తగులబెట్టడంతో 40 ఎకరాల వరకు మంటలు వ్యాపించాయి. వివరాల్లోకి వెళ్తే.. దేవరుప్పులలోని కొనమట్టల ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఓ రైతు తన వ్యవసాయ క్షేత్రంలో వరి కోశాడు. కొయ్యలను తగులబెట్టేందుకు మంట పెట్టగా గాలి రావడంతో విస్తరించాయి. పక్కనే ఉన్న గోలి బాలనర్సింహరెడ్డి, గోలి భాస్కర్‌రెడ్డికి చెందిన 100 మోపుల గడ్డి దగ్ధమైంది. మంటలు వ్యాపించడంతో రైతులు ఆందోళన చెందారు. గడ్డివాములున్న వారు వీటిని వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.